
# పందెం

'శంకర మంచి సత్యం'
స్మారక సంక్రాంతి కథల పోటీలో
రు.116 గెలుచుకున్న రచన




బరువుగా బాధగా సైకిల్ తొక్కుతున్నాడు బాలాజీ.

నోటినిండా చేదు తిన్నట్లు ముఖం జేవురించి మాడిపోయి వుంది. తెలుసున్నవారు ఎవ్వరైనా ఎదురుపడినా, వాళ్ళు పలకరిస్తే తన బాధ ఎక్కడ బైట పడిపోతుందో అన్నట్టు ముఖం తిప్పేసుకుంటున్నాడు.

అతనికి బాధగా వుంది. చాలా బాధగా వుంది. కసిగా వుంది. తన మీద తనకే అసహ్యంగా వుంది. తనని ఇంత వికారంగా తయారుచేసిన ఆ దేవుడు కనిపిస్తే కసితీరా చితక్కొట్టాలని వుంది.

బాలాజీ అందంగా వుండడు. అంతేకాదు- చాలా ఎబ్బెట్టుగా, వికారంగా వుంటాడు కూడా. జీడి వలుపు, ముఖం నిండా గుంటలు, చిన్ని చిన్ని చింతాకుల్లాంటి కళ్ళు, [illegible] ట్టి ముక్కు, దాకలాటి నోరు, దాన్ని చొచ్చుకు బైటికి తొంగి చూస్తూన్న పళ్ళు, పొట్టిగా- లావుగా- నిజానికి ఎంత మొహమాటస్తులైనా బాలాజీ అందం విషయంలో ఏ మాత్రం మొహమాట పడకుండా విపరీతంగా వేళాకోళం చేస్తూ వుంటారు. చిన్నతనం నుండీ ఇంట్లో, స్కూల్లో, బంధువుల్లో ఎక్కడైనా సరే, అందరికీ బాలాజీ ఒక జోకరు. అందరూ అతన్ని మధ్య కూర్చో పెట్టుకుని అవీ ఇవీ అతని చేత మాట్లాడించే వారు. అతను అలా వెళ్ళగానే "ఏం ఆకారంరా దేవుడా!- చూస్తే- ఏడు తరాల వరకూ మగాడి మొహం ఇక చూడక్కర లేదు" కిసుక్కున అనుకోవడం- నవ్వులూ బాలాజీ చెవిన పడేవి. అతనికి ఎంతో బాధనిపించేది.

తను బావుండడు. నిజమే- అంద వికారంగా వుంటాడు. సరే- కానీ ఇంత ఘోరంగా అందరూ ఎందుకు అవమానించడం తనని? రోజూ వింతగా ఎందుకూ చూడడం? ఇంచుమించు బాలాజీ నలుగురి మధ్యా తిరగడం- తగ్గించేశాడు. అతని దృష్టి అంతా చదువు మీదే పెట్టేవాడు. బాగా చదువు అబ్బింది. మంచి ఉద్యోగమూ వచ్చింది. అన్నీ వున్నా, బాలాజీ ఒక్కరోజు, ఒక్క క్షణం కూడా హాయిగా మనస్ఫూర్తిగా నవ్వుకుని- సంతోషంగా వున్న పాపాన లేదు. తనకేసి

సూరి సత్యవాణి

## రచయిత్రి స్వపరిచయం



నేను పుట్టింది పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో. చిన్నప్పటి నుండీ మా అమ్మగారి దగ్గర సంగీతం నేర్చుకున్నాను. ఆపైన విజయవాడ ప్రభుత్వ సంగీత కళాశాల నుండి పి.జి. డిప్లొమా పొందాను. ప్రస్తుతం సంగీత పాఠాలు చెప్పడం నా వృత్తి.

నా మొదటి కథ 'ఆంధ్రజ్యోతి'లోనే అచ్చయింది. ఆ తర్వాత ఆంధ్రజ్యోతిలోనే మరో రెండు, ఆంధ్రప్రభలో రెండు, వనితలో ఒకటి, స్వాతి మంత్లీలో ఒకటి, బాలజ్యోతిలో రెండు నా కథలు ప్రచురించబడ్డాయి. రెండేళ్ళ క్రితం 'సరిగమలు' అని పది కాలమ్‌ల దాకా కథలు ఆంధ్రజ్యోతిలోనే వచ్చాయి. ఏరి, కోరి ఎంచుకున్న మంచి పుస్తకాలు మాత్రమే చదువుతాను. కాలక్షేపానికి ఏ పుస్తకమూ చదవను. శ్రీ పాద వారి రచనలన్నా, రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి రచనలన్నా ప్రాణంతో సమానం. పాత హిందీ, తెలుగు సినిమా పాటలంటే ఇష్టం. ఆంధ్రజ్యోతిలో నా కథ 'పందెం'కి బహుమతి రావడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ఇంకా మంచి మంచి కథలు వ్రాయాలనే ఉత్సాహాన్ని నాలో ఇనుమడింపజేసింది.

—మూరి సత్యవాణి
విజయవాడ

కొంతమంది ఆశ్చర్యంగా, మరి కొందరు జుగుప్సగా, ఇంకా మరి కొందరు హేళనగా, ఇంకా వ్యంగ్యంగా– జాలిగా– అనేక రకాల చూపులు బాణాల్లా దూసుకు పోతూ వుంటాయి బాలాజీ మనసులోకి. బాలాజీ ఎప్పుడూ కొత్తగా బాధపడుతూనే వున్నాడు. బాధ పడుతూనే వుంటాడు. ఎందుకంటే, ఎవ్వరికీ కనిపించని అతి సున్నితమైన 'అందమైన' మనసు వుంది అతనికి. ఆ మనసుకి ఈ 'చూపులు' ఇంకా అలవాటు పడలేదు ముప్పై ఏళ్ళు నిండినా–

ఆలోచనలతో కూరల బజారు దాటి వెళ్ళిపోతున్న బాలాజీ ఉలుక్కున ఈ లోకంలోకి వచ్చాడు. సైకిల్ వెనక్కి తిప్పి మళ్ళీ కూరల బజారు దగ్గర కొచ్చాడు. స్టాండ్‌వేసి సంచీ తీసుకుని లోపలికి వెళ్ళాడు. ఎప్పుడూ తనకి కూరలు ఇచ్చే అమ్మి– తను రావడం చూసి, పక్క వాళ్ళకి సైగ చేసి, నవ్వుని కళ్ళలోనూ, బుగ్గల్లోనూ దాచేసుకుంది.

బాలాజీకి ఇవేం పట్టించుకునే స్థితిలేదు. అతని మనసు ఎప్పటి కంటే తీవ్రంగా గాయపడింది. అతనికి బుద్ధి తెలిసి పెద్దయ్యాకా అతను విపరీతంగా బాధపడిన సంఘటనలు రెండు– మొదటిసారి తనని పెంచి పెద్ద చేసిన బామ్మ పక్కవాళ్ళతో " మా బాలాజీకి పెళ్ళి చేసేస్తే నా బాధ్యత తీరిపోతుందండీ, కానీ అది ఓ పట్టాన పడేటట్టు లేదులెండి. అసలు వాడ్ని చేసుకోవడానికి ఏ పిల్ల అయినా ఒప్పుకుంటుందా– అని దిగులుగా వుంది. పెంచి పెద్ద చేసిన నా కళ్ళకే వీడు ఇంత అనాకారిలా కనిపిస్తే, ఇక పరాయి పిల్లకి వీడు నచ్చుతాడంటారా?" అంటూన్నప్పుడు– బాలాజీ ఆ రోజు ఊరి చివర కాలవ గట్టున కూర్చుని తనివి తీరా ఏడిచాడు. అసలు 'చచ్చిపోతే' అన్న ఆలోచన కూడా వచ్చింది. అతను చావకుండా, బతుకు మీద ఆశలు మాత్రం చంపేసుకున్నాడు ఆ రోజు. ఆ రోజు బామ్మ అన్న మాటలు బాలాజీ మనసుని ఎలా కుదిపేశాయో, మళ్ళీ– రెండోసారి– ఈ రోజున, తాయారు అన్న మాటలు అంత అవమానకరంగా దహించివేస్తున్నాయి. లోపల వచ్చి వుండి పోయి పైకి పొప్పరు కట్టేసిన పుండు కసుక్కున రేగినట్టయింది బాలాజీకి.

అతనుగానీ, వాళ్ళ బామ్మగానీ ఊహించని విధంగా తాయరుతో పెళ్ళి అయింది బాలాజీకి. తాయారు సంసార పక్షంగా, కలకల్లాడుతూ, చక్కగా వుంటుంది. బాలాజీ ముందు అప్సరసే. తనని చేసుకోవడం ఆమెకి బలవంతం మాత్రం కాదని తెలుసుకున్న బాలాజీ ఎంతో ఉప్పొంగి పోయాడు. పెళ్ళి అయ్యాక అతనూ భార్య ఎక్కడికైనా వెడుతూంటే– అమావాస్య, పౌర్ణమి కలిసి వెడుతూన్నట్లు అనుకోవడం– కాకి ముక్కుకు దొండ పండంటే అదే– అంటూ గుసగుసలూ విని పించేవి. అవేమీ బాలాజీని అంతగా బాధించలేదు. కారణం– తాయారు తన్ని ఇష్టపడి పెళ్ళి చేసుకుంది. అంతే చాలు అతనికి.

పెళ్ళి అయిన మొదటి మూడు నెలల వరకూ బాగానే వుంది తాయరు. ఆ తర్వాత అందరిలాగే మొదలుపెట్టింది. ఆమెకి ఉదయం నిద్ర లేస్తూనే బాలాజీని ఎగతాళి చెయ్యడమే పని. అతను మొహం కడుక్కుంటూ వుంటే– "చాల్లెండి ఎంత సేపు తోవుతారూ ఆ పళ్ళని– అరటి పళ్ళ అత్తాల్లా రెండేసి వరసలూ మీరూనూ" అంటూ ఫెళ్ళున నవ్వేది. సబ్బుతో ముఖం రుద్దుకుంటే– తువ్వాలు అందిస్తూ– "ఎలకతోలు తెచ్చి ఏడాది ఉతికినా నలుపు నలుపేగాని తెలుపురాదు" అంటూ రాగాలు తీసేది. షేవ్ చేసుకునే అద్దం పగిలి పోతే– "మీ ముఖం చూడలేక చూడండి పాపం అది ముఖం ఎట్లా చిట్లించుకుందో" అనేది వ్యంగ్యంగా. విసి విసి విసుగెత్తిపోయిన బాలాజీ ఒక రోజున నిలదీసి అడిగాడు– "మరి అంత నచ్చని వాడిని ఎందుకు పెళ్ళి చేసుకున్నావ్?" అని. "గత్యంతరం లేక"– గోడకి కొట్టిన బంతి వెనక్కి వచ్చినట్లు ఠక్కున చెప్పింది తాయారు.

"నా వెనక నలుగురి చెల్లెళ్ళకి అవ్వాలి పెళ్ళిళ్ళు. మా నాన్న కట్నాలు ఇచ్చుకోలేడు– మాకు డబ్బు లేదు. మీ బామ్మ కట్నం వద్దంది– అంతే ! లేకపోతే, మీ సుందర మోహనాకారాన్ని చూసి వలచి వరించి వచ్చాననుకుంటున్నారా? హయ్యో! నంబడం–. ఈ లోకంలో ఎవత్తి కన్నెత్తి కూడా చూడదు మిమ్మల్ని. అంతకంటే నూతి లోకి దూకి ఛస్తానంటుంది" దడా దడా దండకం చదివేసింది తాయారు.

బాలాజీ బిగ దీసుకుపోయాడు. అతని మనసు





సైబాల్

పుండ్లు,చిడు,రణగడ్డలు,కాల్పులు,
నరుసులు,గజ్జి,తామర,వరుపులు,
ము॥వాటికి అమోఘముగా పనిచేయును.



Mfrs: THE SOUTH INDIAN MFG Co,MADURAI.
Stockists: SEETHARAMA GENRAL STORES(AGENCIES)VIJAYAWADA.

మొద్దుబారింది. ఒక రకమైన నిర్లిప్తత చోటు చేసుకుందతని మనసులో. యాంత్రికంగా రోజులు గడిచిపోతున్నాయి. ఇద్దరు పిల్లల తండ్రి అయ్యాడు బాలాజీ. భార్యా పిల్లలతో తిరుపతి వెళ్ళాడు బాలాజీ. దారిలో చెప్పింది తాయారు- పిల్లలకి బాలాజీ పోలిక రాకుండా వుంటే కొండకొస్తానని మొక్కుకున్నానని, విరక్తిగా నవ్వు కున్నాడు బాలాజీ. అతనికి ఆ ధ్యాసే లేదు. కానీ అతని పిల్లలిద్దరూ చిత్రంగా, చిలకల్లా వుంటారు. అందరూ వాళ్ళని తల్లి పోలికే అంటారు తన ఎదుటనే- తాయారు పొంగిపోతూ వుంటుంది. బాలాజీకి అప్పుడప్పుడు అని పిస్తూ వుంటుంది ఒక్కరైనా తన పోలికవస్తే, తాయారు ముఖం చూడాలి అప్పుడు- కానీ ప్చ్... ఓటమి- ఓటమి- నిరాశ- నిరాశ- అతను పుట్టి బుద్ధెరిగాక ఏ చిన్న విషయంలోనూ విజయవంతంగా ఆనందించి ఎరగడే-

కూరలు తీసుకొచ్చి ఇంట్లో ఇచ్చేశాడు యాంత్రికంగా.

"ఇదిగో — చూడండీ! పాపాయికి కాలు నొప్పిగా వుందిట. మీరు ఆఫీసుకు వెళ్ళే ముందు దాన్ని స్కూలు దగ్గర దింపి వెళ్ళండి. ఆనక నే వెళ్ళి తెచ్చుకుంటాను" — ఆర్డరు జారీ చేసి లోపలికి వెళ్ళిపోయింది తాయారు.

బాలాజీ పేడక్కుర్చీలో కూలబడ్డాడు. అతనికి ఉదయం తాయారు అన్న మాటలే వద్దన్నా చెవుల్లో గింగురుమంటున్నాయి. "చూశారా — పక్కింటి రాధమ్మ లేదూ — ఆవిడ మొగుడితో పోట్లాడేసుకుందిట దేనికో. హృషీకేశానికి వెళ్ళిపోతానని బెదిరించిందిట. ఆ పళంగా వచ్చినట్టు కాళ్ళ బేరానికొచ్చాట్ట మొగుడు —" వింతగా చెప్పింది తాయారు బుగ్గలు నొక్కుకుంటూ. బాలాజీకి నవ్వొచ్చింది.

## 22-1-88 సంచికలో ప్రచురించిన 'కాలుష్యం' రచయిత్రి స్వపరిచయం



సంక్రాంతి 88 ... కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి రూ. 116/-

### శంకరమంచి స్మృతికి

నా కథకు బహుమతి నిచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు. పున్నాగ పూల వర్షంలాంటి అమరావతి కథలను పూచిన చెట్టు సువాసనామాత్రంగా మిగిలిన స్మృతిని ఈ సందర్భంగా స్మరిస్తున్నాను.

వృత్తిరీత్యా తెలుగు లెక్చరర్‌ని. ప్రవృత్తి మనసెరిగిన వాళ్ళతో కబుర్లు చెప్తూ, వింటూ-వింటూ, చెప్తూ వుండి పోవడం.

'కాలుష్యం' కథలోని చిన్నిలాంటి వాళ్ళని చూసి ఎంతో దిగులుపడ్డాను. అలాంటి 'చిన్ని' తల్లులకి ఈ కథ అంకితం.

-వ్రాడేవు వీరలక్ష్మీ దేవి, కాకినాడ

"తాయారూ! నాకూ వెళ్ళిపోవాలని వుంది - ఏ హరిద్వారానికో, బదరీకో — వెళ్ళమంటావా?" అన్నాడు తమాషాగా. అంతే! తాయారు గొంతు సాగింది తారస్థాయికి.

"అయ్యో - మీ అందానికి మీరు హృషీకేశానికీ - హరిద్వారానికీ ఎందుకూ? — మీరెక్కడ వుంటే అక్కడే అందరికీ సన్యాసం పుచ్చుకోవాలనిపిస్తుంది. అంత వెళ్ళాలని వుంటే దివ్యంగా వెళ్ళండి - ఆ ఆఫీసు డబ్బు మా మొహాల్ని పారేసి మరీ పొండి. నేనూ, నా పిల్లలూ హాయిగా వుంటాం. చాలు - ఆ రోజు పండగే. పరవాన్నం వండి ఊరంతా పంచిపెట్టనూ" తాయారు గొంతు తగ్గడంతోటే బైట వరండాలోంచి ఓ గుంపు నవ్వులూ —


బాలాజీకి చాలా అవమానంగా అనిపించింది. ఆ రోజు బామ్మ అన్న మాటలకన్నా పది రెట్లు ఎక్కువ విలవిల్లాడింది అతని మనసు. తను అక్కర లేదు-తన సంపాదన కావాలీ, తను అక్కర లేదు-తన సంతానం కావాలీ, తన ఉనికీ అక్కర లేదు, తనూ అక్కరలేదు. బాలాజీకి ఏడుపు తన్నుకొస్తూ వుంటే ఎంతో కష్టంగా నిగ్రహించుకున్నాడు.

# బి.యన్. భాషితాలు

వాస్తుశిల్పి బి.యన్.రెడ్డి

సమాజంలో మంచిమార్పు రావాలని
పాపమాతడు ఎంత ప్రయత్నిస్తున్నాడో
కానీ చుట్టూ వున్న కోతులు కొండ
ముచ్చులు
అతని చిలుక పలుకులు వింటాయా?





ఎవడో అన్యాయం చేశాడని
ఏడిస్తే ఏం లాభం?
చరాచర జగత్తును సృష్టించిన మహానుభావుడే
నరరూప రాక్షసులను సృష్టించి తమాషా
చూస్తుంటే-

ఆరు పదులు నిండిన నేను
పెద్దగా సాధించిన దేముంది?
ఒక్క అడుగు ముందుకు వేస్తే
రెండడుగులు వెనక్కి వేశాను-



తొమ్మిది గంటలకల్లా తయారయి పాపాయిని తీసుకుని బయల్దేరాడు. స్కూలు దగ్గర సైకిల్ ఆపి పాపని దించి క్లాసురూంలో వదిలి మళ్ళీ వచ్చాడు. స్కూలు అంటే - ఎల్‌కేజీ నుంచీ డిగ్రీ వరకూ వున్న స్కూలూ కాలేజీ అది. పరధ్యానంగా వున్న బాలాజీ కళ్ళముందు ఓ మెరుపు మెరిసింది. సన్నజాజుల పరిమళం చుట్టుముట్టింది. మొగలి రేకులాంటి పద్దెనిమిదేళ్ళ అందమైన పడుచుపిల్ల లేడిలా గెంతుతూ వచ్చింది బాలాజీ వైపుకు. ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలుసుకునే వ్యవధే లేదు. అసలు తెలివే లేదు బాలాజీకి. చటుక్కున ఆ పిల్ల తన చేతుల్తో బాలాజీ ముఖాన్ని పట్టుకుని ఆ బుగ్గా, ఈ బుగ్గా ముద్దు పెట్టేసుకుంది. ఆ వెంటనే పక్కనుంచీ ఈలలూ, తప్పట్లూ, వన్స్‌మోర్ ... యు ఆర్ గ్రేట్ - లాంటి కలగాపులగపు మాటలూ - గోల - అంతా గోల. బాలాజీ కాళ్ళకి, చేతులకి పక్షవాతం వచ్చినట్టు చచ్చుపడిపోయాయి కొద్ది క్షణాలు. మళ్ళీ క్షణాల్లోనే తేరుకుని అతి వేగంగా సైకిలెక్కి దూసుకు పోయాడు ముందుకి.

బాలాజీకి మహా ఆనందంగా వుంది. ఖుషీగా వుంది. అతని శరీరం గాలిలో తేలిపోతూన్నట్టుంది. అతని ఊహలు చుక్కల్ని తాకుతున్నాయి. అబ్బా - ఇన్నాళ్ళకి తను పుట్టి బుద్దెరిగాక తనని ఒకళ్ళు ముద్దుపెట్టుకోవడమే!! అందులోనూ ఆడపిల్ల - పైగా పడుచుపిల్ల - మరిక అందమైన పిల్ల - ఒహోయ్ - బాలాజీకి ఉక్కిరిబిక్కిరిగా వుంది. గిలిగింతలుగా వుంది. ఆఫీసులో పని చకచకా పూర్తిచేశాడు. ఇంటికొస్తూ దారిలో పూలూ, పళ్ళూ, చాక్‌లెట్లూ, మిఠాయిలూ కొన్నాడు. హుషారుగా ఈల వేసుకుంటూ వచ్చేశాడు ఇంటికి.

బాలాజీ అందించినవి అన్నీ తీసుకుంటూ ''ఇవన్నీ ఎందుకూ ఇప్పుడు?'' అంది తాయారు. ఆమె దృష్టి ఎప్పుడూ అతని ఇంక్రిమెంటు మీదే వుంటుంది. అది క్రితం నెలలో రానే వచ్చింది కూడా.

''ఇవాళ నా మనసు చాలా ఆనందంగా వుంది- అందుకు'' అన్నాడు బాలాజీ ముక్తసరిగా.

''బావుంది, మీ మనసుకి ఆనందంగా వుంటే ఇవాళ




ఇటీవల ఒరిస్సా రాష్ట్రంలో వెంట్రిలాక్విజమ్ గురించి సోదాహరణ ప్రసంగం చేసిన శ్రీ వై.పరమేశ్వరరావు, హనుమకొండ

నా మనసుకి ఆశ్చర్యంగా వుంది'' అంది తాయారు ఏదో చెప్పాలని ఉబలాట పడిపోతూ.

''నీ మనసు కెందుకూ ఆశ్చర్యం?''

ఆమెతో మాటలు పొడిగించడం అంటే బాలాజీకి ఎప్పుడూ భయమే.

''ఎందుకేమిటి? రోజులు తగలబడ్డట్టు వుంటేనూ. ఇవాళ ఉదయం-ఈ వింత విన్నారా?! పాపాయి వాళ్ళ స్కూలు పిల్ల - అదే కాలేజీ చదువు వెలగబెడుతోందిలే - ఈ ఆడపిల్లలు మరీ బరితెగించి పోతున్నారు. గుర్రాల్లా పెంచడమేనా - వాళ్ళని తల్లిదండ్రులు అదుపులో పెట్టుకోవద్దూ? -'తల్లుల్లారా చక్కగా చదువుకోండి' అని బడికి పంపిస్తే, వాళ్ళు వెర్రెక్కి పోతున్నారు. అదెవర్తో - సిగ్గు లేక వాళ్ళ స్నేహితులతో 'పందెం' కాసిందిట - రోడ్డు మీద వెళ్ళే మగవాళ్ళ నెవరినైనా ముద్దు పెట్టుకుంటానని. హవ్వ - దాని సిగ్గు చిమిడి పోనూ - అలానే పెట్టుకుందిట. ఇక ఊరు ఊరంతా గుప్పున పాక్కిపోయిందీ వార్త. ఇక జన్మకి ఆ పిల్లకి పెళ్ళి అవుతుందా? కావలసిందే అలాంటి పిల్లకి - పొద్దుటి నుంచీ ఒకటే గోలట - కాలేజీలో హడావిడేనట. ఆ పిల్లని డిబార్ చేస్తానంటోందిట ప్రిన్సిపాల్. ససేమిరా అంటున్నారుట పిల్లలు. స్ట్రైకు కూడా చేస్తారుట ఆ రౌడీ పిల్లకి సపోర్టుగా. ఆడపిల్లల్ని జులాయిగా పెంచితే మరి అంతే శిక్ష. డిబారే - అయినా ఆ రోడ్డు మీద ఎవర్ని ముద్దు పెట్టుకుందో - ఏమో పాడు ఫీ - ఎవడో ఏబ్రాసి వెధవ అయివుంటాడు. అంతేలెండి - అలాంటివాళ్ళే దొరుకుతారు ఇలాంటి బరితెగించిన వాళ్ళకి. లేకపోతే బుద్ధావతారంలా మాట్లాడకుండా పోయాట్ట. మరొక మగాడైతే ఆమట్నిలాగి రెండిచ్చుకోడూ. పిదపకాలం, పిదప బుద్ధులూనూ'' తాయారు గడగడ చెప్పుకు పోతోంది మహా సంతోషంగా.

బాలాజీ బిర్రబిగుసుకుపోయి వింటున్నాడు. ఆడపిల్ల వైపు నుంచి అది ఎంత తప్పు పని అయినా, దాని పర్యవసానం ఎంత తీవ్రంగా వున్నా - బాలాజీకి మాత్రం ఆ రోజు తన జీవితంలో మరపురాని రోజు.

ఆ రోజే తన బతుక్కి ఆఖరి రోజు అయితే బావుండుననిపిస్తోంది బాలాజీకి. అతని జీవిత కాలంలో ఒక్కరోజైనా, ఒక్క గంటైనా, కనీసం ఒక్క నిమిషమైనా సంతోషమెరుగడు. అలాంటిది - ఈ రోజు అతను ఎంత ఆనందంగా వున్నాడు!? ఎంత పులకింతగా వుంది!? ఎంత థ్రిల్ అనుభవించాడు!?

ఆ పిల్ల పొగరుగా, జులాయిగా, వేలంవెర్రిగా తన భవిష్యత్తు గురించి ఆలోచన లేకుండా - ఒక్క మాటలో బుర్ర లేకుండా కాసిన ఆ 'పందెం' బాలాజీ పాలిట వరం.. అతని జీవితానికి కొత్త ఊపిరినిచ్చింది. బాలాజీ ముఖంలో నిర్లిప్తత మాయమయి చిరునవ్వు చోటుచేసు కుంది. తన ఆనందానికి, అనిర్వచనీయమైన ఈ సంతోషానికి కారణమైన ఆ అర్థం పర్థం లేని 'పందెం'కి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు బాలాజీ.

